క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ఎన్నిక రేపు

సీతంపేట: ఈనెల 16న సీతంపేటలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ పాలకొండ తాలుకా యూనిట్ ఎన్నికలు జరగనున్నాయని జేఏసీ రాష్ట్ర ఏపీజీఈఏ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు వై.సతీష్ కుమార్, ఎస్.భరత్ భూషణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, బబ్బురు గణేష్, తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

అర్ధంతరంగా నిలిచిన పనులు



పూర్తికాని వాటర్ ట్యాంక్

భామిని: మండలంలోని ఘనసర కాలనీలో వాటర్ ట్యాంక్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు కోసం చేపట్టిన ట్యాంక్ నిర్మాణం పనులు అధికారుల నిర్లక్ష్యంతో పూర్తి కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ట్యాంక్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

రీసర్వే పనులు సమగ్రంగా నిర్వహించాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే పనులను సర్వే సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సీసీఎల్ రికార్డులను తనిఖీ చేసిన అనంతరం దయానిధిపురంలో జరుగుతున్న రీ సర్వే పనులపై సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ఉమామహేశ్వరరావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాఖాపరమైన సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ప్రతి పనికీ జిల్లా కేంద్రాలకు వస్తున్న కారణంగా వీఆర్వోలందరూ క్షేత్రస్థాయిలో పరిష్కారమర్గాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్ శ్రీనివాసరావు, దయానిధిపురం, పెదభోగిలి, రంగంపేట వీఆర్వోలు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

సీతానగరం: మండలంలోని సువర్ణముఖినదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన పెదభోగిలి గ్రామానికి చెందిన ఎస్.అనుదీప్ కుటుంబసభ్యురాలు మైథిలికి ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ బీబీ సాహు బీమాచెక్కును బుధవారం పెదభోగిలి ఎస్‌బీఐలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐలో ఖాతాదారు అనుదీప్‌కు వ్యక్తిగత బీమా సౌకర్యం ఉన్నకారణంగా ప్రమాదబీమా కింద మంజూరైన క్లెయిమ్ రూ.10 లక్షలు అందజేశామన్నారు. అనుదీప్ 2025 జనవరి 14న ప్రమాదవశాత్తు నదిలో పడి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలియ జేశారన్నారు. ఈ మేరకు బ్యాంక్ అధికారులు చేసిన అనంతరం బీమా సౌకర్యం వర్తింపజేశామన్నారు. బ్యాంక్ ఖాతాదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

సీఐటీయూ బైక్ ర్యాలీ

సీతానగరం: దేశంలో రైతులు, కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనందుకు నిరసనగా జాతీయస్థాయిలో ఈనెల 20 న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ జరిగింది. ఈ మేరకు సీఐటీయూ, రైతుసంఘం జిల్లానాయకులు వీవీ రమణ, ఆర్.లక్ష్మునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో సేవలందిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించక పోగా, రైతులు, వ్యవసాయకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు తుంగలోకి తొక్కారన్నారు. అలాగే ఉద్యోగులకు భద్రత కల్పిస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఇంతవరకూ అమలు చేయడంలో విఫలమయ్యాయని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ప్రజాగ్రహానికి గురికాక ముందే సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి ఈశ్వరరావు, వి.రామలక్ష్మి, ఆర్.రమణమూర్తి, ఆర్ రాము, వై రామారావు, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

మొక్క జొన్న రైతుకు కష్టాలు

సాలూరు రూరల్: మండలంలోని మొక్కజొన్న రైతులు తొలకరి, వేసవి పంటలు రెండు పూర్తిగా దళారులకే అమ్మకాలు చేశారు. ప్రభుత్వం అన్ని పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తా మని ప్రకటించడమే తప్ప ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో కనీస ప్రయత్నం కూడా చేయడంలేదు. ప్రస్తుతం మండలంలోని మొక్కజొన్న రైతులు ప్రైవేట్ వ్యక్తులకు రూ.2200 నుంచి రూ. 2350 వరకు అమ్మకాలు చేశారు. అయితే ప్రస్తుతం చివరి దశ పంట చేతికి వచ్చిన రైతులు మొక్కజొన్నకు ధర లేకపోవడంతో రోడ్లుపై ఆరబెట్టుకుని ధర పెరుగుతుందేమోనని ఎదురు చూస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు కూడా మొక్కజొన్న కొనుగోలుకు చొరవ చూపడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో మొక్కజొన్న రైతు ఇబ్బందులు ఎదుర్కొటున్నాడు.

వేపారమ్మకు ముర్రాటలు



గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి గ్రామదేవత వేపారమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. అమ్మవారికి బుధవారం డప్పు వాయిద్యాలతో భక్తులు వెళ్లి భోగాలు సమర్పించారు. అమ్మవారిని ఎజ్జోళ్ల డప్పు వాయిద్యాలతో వైభవంగా ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎజ్జోళ్ల డప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. – గుమ్మలక్ష్మీపురం

రహదారి కష్టాలు..



కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు తమ గ్రామ రహదారి బాగుపడుతుందని భాసూరు – ఎం.సింగుపురం గ్రామాల ప్రజలు ఆశ పడ్డారు. అధికారం చేపట్టి దాదాపు 11 నెలలు పూర్తయినా తమ రహదారిని ఎవ్వరూ పట్టించుకోకపోవడం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మొత్తం ఛిద్రం కావడంతో రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయని.. అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు. – పాలకొండ రూరల్

మూలకు చేరిన బోరు..



పాలకొండ మండలంలోని పద్మాపురంలో గల చేతిబోరు మూలకు చేరింది. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.
– పాలకొండ రూరల్

ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

- విశ్రాంత ఐఏఎస్ అధికారి మురళి



శిక్షణలో సూచనలిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి

గరుగుబిల్లి: యువత పోటీ పరీక్షలకు ప్రణాళికతో సిద్ధం కావాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, శ్రీరామచంద్ర మిషన్ హర్ట్‌ఫుల్‌నెస్ శిక్షకుడు జె.మురళి అన్నారు. మండలంలోని తోటపల్లిలో జట్టు ట్రస్టు కార్యాలయ ప్రాంగణంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువతకు జీవిత మార్గదర్శాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు, ఉన్నత చదువులకు ఎలా సిద్ధం కావాలి? విజయాలను ఎలా అందుకోవాలి? ధ్యానం ద్వారా జ్ఞాపక శక్తిని ఎలా పెంచుకోవాలి? తెలివితేటలను ఎలా వృద్ధి చేసుకోవాలి? ధ్యానం ద్వారా జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలి? మానవ జీవితంలో సన్మార్గం వైపు మార్పు రావాలంటే ధ్యానం జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఉదయ్ భాస్కర్, శ్రీధర్, సోమశేఖర్ యువతకు పలు విషయాలపై శిక్షణ ఇచ్చారు. జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ: రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘ నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఈ నెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బహుళ జాతి సంస్థలకు ప్రయోజనం కలిగించేందుకు తీసుకువచ్చిన చట్టాలను రద్దు చేయాలని కోరారు. సమ్మెలో రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కిమిడి రామ్మూర్తి, రమణమూర్తి, సోంబాబు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్ సక్రమంగా నిర్వహించాలి



నిడగల్లగూడలో స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారిణి, సిబ్బంది

జియ్యమ్మవలస: మలేరియా నిర్మూలనలో భాగంగా గిరిజన గ్రామాల్లో చేపడుతున్న ఐఆర్ఎస్ ఏసీఎం ఐదు శాతం స్ప్రేయింగ్ సక్రమంగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి సూచించారు. రావాడ రామభద్రపురం ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడగల్లగూడ గ్రామంలో చేపట్టిన స్ప్రేయింగ్ పనులకు బుధవారం పరిశీలించారు. సక్రమంగా స్ప్రేయింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మలేరియా కురుపాం సబ్ యూనిట్ సూపర్‌వైజర్ కె.రాధాకృష్ణ, రాజశేఖర్, హెచ్‌వీ ఇస్తార్, ఏఎస్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ పార్కుతో ఉపాధి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

సీతంపేట: ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని పణుకువలస ప్రాంతంలో 27 ఎకరాల స్థలంలో రూ.7 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.87 కోట్ల పెట్టుబడులు తీసుకురావడానికి అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ బీబీ మిశ్రో, ఏఎంసీ చైర్మన్ బి.సంధ్యారాణి, కూటమి నాయకులు ఐ.పవన్, ఎస్. తోటముఖలింగం, జి.రవణమ్మ, కె.అప్పలనాయుడు, బి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై కానరాని ముఖ్యుల పేర్లు

సీతంపేట: స్థానిక ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకంపై ముఖ్యమైన పేర్లు రాయకుండా అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారు. మండలంలోని పణుకువలస గ్రామ పరిధిలో రూ.7 కోట్లతో నిర్మించనున్న పార్కుకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. శిలాఫలకంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పేర్లు లేవు. ఆయా పేర్లు శిలాఫలకంపై చేర్చాలని ఎమ్మెల్యే తన ప్రసంగంలో సూచించారు. కాగా జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.లక్ష్మి పేరు రాయకుండా ఆమె భర్త ఎస్.రాము పేరు రాయడం గమనార్హం. ఈ విషయమై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్ వద్ద ప్రస్తావించగా డీఆర్‌ఓ పంపించిన పేర్లు ప్రొటోకాల్ ప్రకారం రాయించామన్నారు.



ఉప ముఖ్యమంత్రి, ఐటీడీఏ పీఓ పేర్లు లేని శిలాఫలకం ఇదే

గ్రామ తీర్మానాల ఆధారంగా పనులు చేయించాలి



మాట్లాడుతున్న ఏపీఓ బాలకృష్ణ

సీతానగరం: ఉపాధిహామీ పనులన్నీ గ్రామాల్లో ప్రజలతో నిర్వహించిన గ్రామసభల్లో ఇచ్చిన తీర్మానం ఆధారంగా చేయించాలని ఏపీఓ బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ జేఈ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం టీఏలు, క్షేత్రసహాయకులతో ఉపాధిహామీ పనుల నిర్వహణపై సమీక్షాసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాలకు వచ్చిన క్షేత్రసహాయకులందరూ గ్రామసభ తీర్మానాలను విధిగా తేవాలని స్పష్టం చేశారు. అలాగే నిర్దేశించిన ఫారంపాండ్స్ టార్గెట్ ప్రతి పంచాయతీలో రీచ్ కావాలని చెప్పారు. బీమా పత్రాలు, బ్యాంక్ అకౌంట్ తీసుకోవాలని సూచించారు. ప్రతి వేతనదారుకు బీమా సౌకర్యం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్‌లు నీరు, టెంట్‌లు సమకూర్చుకోవాలని సూచించారు.



నులకజోడులో ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్లు

తడిచిన ధాన్యం

భామిని: మండల వ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షానికి కళ్లాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిచిపోయాయి. మండలంలోని నులకజోడు, బిల్లుమడ, నేరడి–బి, గురండి, బొమ్మిక, కాట్రగడ–బి, తదితర గ్రామాల్లో రైతులు వరి కోతలు పూర్తి చేసి ధాన్యం బస్తాలను రోడ్డు పక్కన, కళ్లాల్లో నిల్వ చేశారు. అయితే వర్షానికి ధాన్యం తడిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

శతశాతం ఉత్తీర్ణత..

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరంలో గల ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు అఖిల భారత సెకెండరీ పాఠశాల పదో తరగతి ఫలితాల్లో (సీబీఎస్‌సీ) శతశాతం ఉత్తీర్ణ సాధించినట్లు ప్రిన్స్‌పాల్ ఎం.వెంకటరమారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు ఎం.ప్రజ్ఞారెడ్డి 93.4 శాతం, జి.సాయిశ్రీ, కె.సాత్విక్ 93 శాతం, కొనపల గౌరీశంకర్ 92.4 శాతం మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎం.ప్రజ్ఞారెడ్డి



జి.సాయిశ్రీ



కె.సాత్విక్



కొనపల గౌరీశంకర్

ఏకలవ్యలో శతశాతం ఫలితాలు

భామిని: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్స్‌పాల్ జి.గంగాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 57 మంది విద్యార్థులకు గాను అందరూ పాసయ్యారని.. అలాగే 12వ తరగతిలో 63 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించాని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సాలూరు:

అగ్నిప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖాధిరారి రాజారావు అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని శ్యామలాంబ ఆలయం వద్ద అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలం నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదముందని, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పు డు తీసుకోవాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు, సిబ్బంది

కౌన్సిలర్లకు అవమానం..!

- ప్రొటోకాల్ ఉల్లంఘనపై కమిషనర్‌ను నిలదీసిన సభ్యులు
- ఇంకెన్నిసార్లు అవమానిస్తారని చైర్‌పర్సన్ ఆవేదన



వాడివేడిగా జరుగుతున్న మున్సిపల్ సర్వసభ్యసమావేశం

సాలూరు: మున్సిపాలిటీలో కౌన్సిలర్లు అంటే అధికారులకు చిన్న చూపుగా ఉందని, కనీసం ప్రోటోకాల్ పాటించకుండా అడుగడుగునా అవమానిస్తున్నారంటూ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ కృష్ణారావు అధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడివేడిగా జరిగింది. ప్రోటోకాల్ ఉల్లంఘనలు, ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ సమక్షంలో మంత్రి సంధ్యారాణి సమీక్ష సమావేశం గురించి కౌన్సిలర్లకు తెలపకపోవడం, రూ.2 కోట్ల అప్పు డబ్బులతో చేపట్టాల్సిన పనుల కేటాయింపు వాటి జాబితా తదితర అంశాలపై కౌన్సిలర్లు కమిషనర్‌ను నిలదీశారు. గత నెలలో 26వ వార్డులో ప్రారంభోత్సవం చేసిన పైలెట్ వాటర్ స్కీమ్ శిలాఫలకంలో మంత్రి పేరు తప్ప ఇంకెవరి పేర్లు లేకపోవడంపై కమిషనర్ వివరణ ఇవ్వాలని, లేకుంటే చైర్‌పర్సన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటే ఆ ఫిర్యాదు కాపీలో తామంతా సంతకాలు చేస్తామని వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు తదితరులు తెలిపారు. శ్యామలాంబ పండగ ఏర్పాట్లపై మంత్రి సంధ్యారాణి మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ మినహా మిగిలిన కౌన్సిలర్‌లకు తెలియజేయలేదని, ఇదే సమావేశంలో కౌన్సిల్ హాల్‌లోకి టీడీపీ నాయకులు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

నెరవేరని మంత్రి హామీ

పట్టణంలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణంపూర్తిచేయకపోవడంతో మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీ నేటికీ అమలుకాని పరిస్థితి నెలకొందని, పలువురు మహిళలు బహిరంగ ప్రాంతాలకు మలమూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తోందని దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు తెలిపారు. పండగ వేళలో నూతన మరుగుదొడ్లు నిర్మించలేకపోయినా, కనీసం ఉన్న సామాజిక మరుగుదొడ్లకు నీటి సదుపాయం కల్పించడం, డోర్లు ఏర్పాటుచేయాలని కౌన్సిలర్లు కోరారు. వీధుల్లో విద్యుత్‌లైట్లు పోయాయని వెంటనే కొత్త లైట్లు వేయాలని కౌన్సిలర్లు బలభద్రుని శ్రీనివాసరావు, లింగాల దుర్గ తదితరులు కోరారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతుండగా, తాను కలెక్టర్ సమావేశానికి వెళ్లాలని కావున మాట్లాడి వెళ్లిపోతానని, అంతవరకు మీరు మాట్లాడవద్దంటూ కమిషనర్ కృష్ణారావు మున్సిపల్‌చైర్‌పర్సన్‌కు తెలపడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. పండగ నేపథ్యంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి చర్చిస్తుండగా కమిషనర్ వెళ్లిపోతానని అనడం ఏంటని, పైగా చైర్‌పర్సన్‌గా తాను మాట్లాడుతుంటే తనను ఆగమని తెలపడం ఏమిటని, చైర్‌పర్సన్‌ను, కౌన్సిలర్లను ఎన్నిసార్లు ఇంకా అవమానిస్తారని చైర్‌పర్సన్ ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సూచనల మేరకు

దీనిపై కమిషనర్ మాట్లాడుతూ, నాడు కలెక్టర్ సూచన మేరకు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, ఉత్సవ కమిటీ సభ్యులను పిలిచినట్లు చెప్పారు. నాటి సమావేశంలోనే మంత్రి మాట్లాడుతూ, మార్చిలో అప్పుగా డబ్బులు వస్తే ఇప్పటివరకు పనులు చేపట్టలేదని మంత్రి అధికారులపై అసహనం వ్యక్తంచేశారని కౌన్సిలర్లు గుర్తుచేశారు. ఆ పనుల జాప్యానికి ఎవరు కారణమో తెలియజేయాలని అధికారులను ప్రశ్నించారు. రూ.2 కోట్ల అప్పుతో చేపట్టాల్సిన పనులకోసం ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన జాబితాను ఎవరు, ఎప్పుడు ఇచ్చారో తెలపాలని అడుగగా, మున్సిపల్ డీఈ ప్రసాద్ మాట్లాడుతూ, గత నెలలో ఈ జాబితా మంత్రి ఇచ్చారని తెలిపారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ, ఈ పనుల జాప్యానికి మేము కారణం కాదని, గతంలో ఇచ్చిన జాబితా కౌన్సిల్‌ముందుకు తీసుకురాగానే ఆమోదించిన విషయాలను గుర్తుచేశారు. పనుల జాప్యానికి, కౌన్సిలర్లకు ఎటువంటి సంబంధం లేదని కౌన్సిలర్లు పునరుద్ఘాటించారు.

29 నుంచి కృషి సంకల్ప అభియాన్ యాత్ర

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కృషి సంకల్ప అభియాన్ యాత్రను ఈ నెల 29 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్నట్టు కేవీకే రస్తాకుంటుభాయి సమన్వయకర్త డాక్టర్ ఎస్.ధ్రువ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడి పలు విషయాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగేందుకు అవసరమైన సూచనలు, సలహాలిస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

దివ్యాంగులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

- ఏపీసీ తేజేశ్వరరావు



దివ్యాంగురాలిని గుర్తించి పాఠశాలలో చేర్పించాలని సూచిస్తున్న ఏపీసీ తేజేశ్వరరావు

పార్వతీపురం: దివ్యాంగులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్.తేజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలోని అగ్రహారం వీధి 21వ వార్డులో ఆయన పర్యటించి, ఆరేళ్ల మోపాడ హరిణి (దృష్టిలోపం)ని గుర్తించి సమీపంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని సహిత విద్య టీమ్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం దివ్యాంగులైన బడిఈడు పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించేందుకు ఈనెల 13నుంచి జూన్ 9వ తేదీవరకు జిల్లా విద్యా శాఖ, మండల విద్యా శాఖ, సహిత విద్య రిసోర్సుపర్సన్‌లు గ్రామాల్లో పర్యటించి దివ్యాంగులను గుర్తించి వారిని సమీపంలోని పాఠశాలలో చేర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 21 రకాల దివ్యాంగులను గుర్తించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో చేర్పించిన దివ్యాంగులకు ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్, హోమ్‌బేస్డ్, గర్ల్స్ సైఫండ్, అలవెన్సులు సమగ్ర శిక్ష ద్వారా అందించనున్నట్లు చెప్పారు. అలాగే వారికి అవసరమైన వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్‌కూడా ఉచితంగా అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ కోఆర్డినేటర్ భానుమూర్తి తదితరులు ఉన్నారు.